సీఎం వైఖరిపై ఉద్యోగులు ఫైర్

- ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు
- డిమాండ్ల సాధన కోసం పోరాటానికి సిద్ధం
- త్వరలో కార్యాచరణ

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. సీఎం మాటలు తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా నిలదీయాలని నిర్ణయించారు. ఈ మేరకు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోనున్నట్టు వివిధ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లో సమావేశమైన నేతలు త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సర్కారు హామీల అమలును అటకెక్కించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. "దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఐదు విడుతల కరువు భత్యం పెండింగ్‌లో లేదు, పీఆర్సీ గడువు 7/23 నాటికి ముగిసింది. ఆరోగ్యకార్డులు చెల్లుబాటులో లేవు. 2024 మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించడంలేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు నాయకత్వం వహించి, సమస్యల పరిష్కారానికి కృషిచేసిన పూర్వ నాయకులం సమన్వయ కమిటీగా ఏర్పడాలని నిర్ణయించామని వివిధ సంఘాల నేతలు స్పష్టంచేశారు.

దళిత విద్యపై కాంగ్రెస్ కత్తి!

- ఎస్సీ గురుకుల కళాశాలల కుదింపు
- ఈ ఏడు 12చోట్ల అడ్మిషన్ల నిలిపివేత
- అలుగునూర్‌లో కో-ఎడ్యుకేషన్ ఎత్తివేత.. పలు గ్రూపుల తీసివేత
- ఈసారి నోటిఫికేషన్‌లోనూ గోప్యత, గందరగోళం
- ఎక్కడ, ఏ గ్రూప్ ఉన్నదో తెలుపని అధికారులు..!

హైదరాబాద్, మే11 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వివిధ చోట్ల గురుకుల కళాశాలలను కుదించేందుకు కసరత్తు చేపట్టింది. సీవోఈ కాలేజీల్లోనూ కొన్ని గ్రూపులను ఎత్తేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రతిపాదనలు కూడా సొసైటీ ఉన్నతాధికారులు సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంటర్ అడ్మిషన్ల కోసం జారీ చేసిన నోటిఫికేషన్ కూడా కాలేజీల కుదింపు తప్పదనేందుకు బలాన్ని చేకూరుస్తున్నది. ఇక ఇప్పటికే పలు డిగ్రీ కాలేజీలను విలీనం చేయగా, తాజాగా మరికొన్నింటిని పూర్తిగా ఎత్తేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే డిగ్రీ కాలేజీల అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటికీ ప్రకటించలేదని సొసైటీ అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి. సొసైటీ ఉన్నతాధికారుల నిర్ణయంపై ఇటు గురుకుల యూనియన్లు, మరోవైపు తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసేందుకు 2007లో కరీంనగర్ జిల్లా అలుగునూరులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)ను ఏర్పాటు చేశారు. గురుకుల వ్యవస్థలోనే మొదటిసారి కో-ఎడ్యుకేషన్ విధానాన్ని 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్య వరకు ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి ఎంతో మంది విద్యార్థులు ఎన్నో ఉత్తమ ఫలితాలను సాధించారు. కానీ కారణాలేవీ చెప్పకుండానే ప్రస్తుతం ఇక్కడ కో ఎడ్యుకేషన్ విధానాన్ని ఎత్తివేయాలని సొసైటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. సీవోఈ కళాశాలను కేవలం బాలికలకే పరిమితం చేసింది. ఇప్పటికే కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు, కాలేజీ సిబ్బందికి సొసైటీ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు.

పరిమిత గ్రూపులు

ఎస్సీ సొసైటీ పరిధిలోని సుమారు 80 కాలేజీల్లో గురుకుల జూనియర్ కాలేజీల్లో కొన్ని గ్రూపులకే పరిమితం చేయాలని ప్రణాళికలను సిద్ధం చేశారు. కొన్నిచోట్ల కేవలం బైపీసీ, ఎంపీసీ, మరికొన్ని చోట్ల కేవలం సీఈసీ, ఎంఈసీ గ్రూపులనే కొనసాగించాలని ప్రతిపాదనలు చేశారు. ఈ విద్యా సంవత్సరం 12 గురుకుల జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లనే తీసుకోవద్దని సొసైటీ ఉన్నతాధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నోటిఫికేషన్‌లోనూ గోప్యత

జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం సొసైటీ ఈ ఏడాది ఏప్రిల్ 24న నోటిఫికేషన్ జారీ చేసింది. 7 ప్రీమియర్ సీఈవోలు, 31 నాన్ ప్రీమియర్ సీవోలు, 201 నాన్ సీవోఈ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ నోటిఫికేషన్‌లో విద్యార్థులకు సూచించింది. అయితే అందులోనూ సొసైటీ అనేక విషయాలను గోప్యంగా ఉంచింది. ఏ గ్రూపు సీట్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయనేది నోటిఫికేషన్‌లో స్పష్టంగా సొసైటీ పేర్కొనలేదు. విద్యార్థులు కేవలం తాము ఎంపిక చేసుకునే గ్రూపునే ఆర్డర్‌లో ఆప్షన్ ఇవ్వాలని వెల్లడించడం గమనార్హం. దీనిని బట్టే కాలేజీల సంఖ్యను సొసైటీ కుదిస్తున్నదని స్పష్టంగా తెలిసిపోతున్నది. ఈ ఏడాది ఎస్సీ కన్వర్టెడ్ సీట్లకే ఎసరు పెట్టారు. ఈ ఏడాది కన్వర్టెడ్ క్రిస్టియన్స్‌కు సంబంధించిన సీటును సొసైటీ తొలగించింది. ఆ 1 సీటును ఓసీలకు కేటాయించింది. వాస్తవంగా ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్స్ బీసీ సీ గ్రూపు కిందకు వస్తారు. ఒకవేళ ఆ సీటును కేటాయించాల్సి వచ్చినా బీసీలకు కలపాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా ఓసీలకు కలపడంలో ఆంతర్యమేంటో తెలియని పరిస్థితి నెలకొన్నది.

ఉద్యమం తప్పదు

గురుకుల కాలేజీ కుదింపు, కోర్సుల నిర్వహణపై పరిమితులు విధించాలనే సొసైటీ ఉన్నతాధికారుల నిర్ణయంపై ఒకవైపు విద్యార్థుల తల్లిదండ్రులు, మరోవైపు గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్లు నిప్పులు చెరుగుతున్నాయి. అనాలోచితంగా, అసంబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తప్పుడుపడుతున్నారు. ఎస్సీ గురుకుల సొసైటీని పూర్తిగా నిర్వీర్యం చేసే దురుద్దేశమేనని మండిపడుతున్నారు. ఆయా అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణం జోక్యం చేసుకొని తప్పుడు నిర్ణయాలను సవరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భారీ ఉద్యమం చేపడుతామని పేరెంట్స్ సంఘాలు, గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

అడ్మిషన్లను రద్దుచేసే కాలేజీలు ఇవే?

ప్రాంతం	జిల్లా
ఇటిక్యాల	జోగులాంబ గద్వాల
చొప్పదండి	కరీంనగర్
భద్రాచలం	భద్రాద్రి కొత్తగూడెం
సత్తుపల్లి, కూసుమంచి	ఖమ్మం
నర్సింహులపేట	మహబూబాబాద్
దుబ్బాక	సిద్దిపేట
రాయికోడె	సంగారెడ్డి
బిచ్కుంద	కామారెడ్డి
కాటారం	జయశంకర్ భూపాలపల్లి
నర్మెట్ట	జనగాం
మల్కాజిగిరి	మేడ్చల్ మల్కాజిగిరి

ఏఐ వైద్యం ప్రాణ సంకటం!

- చికిత్స కోసం గూగుల్, చాట్‌జీపీటీలతో సొంతవైద్యం
- ఆర్థికంగానే కాక ప్రాణాపాయం చేస్తుందంటున్న వైద్యులు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలకు బాగా అలవాటుపడిన నేటి తరం ప్రజలు ప్రతి విషయానికి వాటిపైనే ఆధారపడుతున్నారు. కొంతమంది తమకున్న మిడిమిడి జ్ఞానాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులకు పంచడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా వైద్య చికిత్సకు సంబంధించిన వీడియోలు (రీల్స్) బాగా వైరల్ అవుతున్నాయి. కార్పొరేట్ దవాఖానల్లో చికిత్సకయ్యే ఖర్చుకు భయపడే సామాన్య ప్రజలు ఈ వీడియోల్లో బోధించే చికిత్సలపై ఆధారపడుతూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. కొన్ని దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులకు సైతం ఎటువంటి ఖర్చు లేకుండా చికిత్సను సూచించే వీడియోలో యూట్యూబ్‌లో వేలల్లో దొరుకుతున్నాయి. గూగుల్, యూట్యూబ్‌లకు తోడు కొత్తగా వచ్చి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత చాట్ జీపీటీలో కూడా రోగాలకు చికిత్సలు లభిస్తున్నాయి. దీంతో చాలామంది తమకు కలిగే శారీరక రుగ్మతలకు ఎటువంటి మాత్రలు వేసుకోవాలో చాట్ జీపీటీని అడిగి తెలుసుకుంటున్నారు. దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధుల లక్షణాలు ప్రాథమికంగా సాధారణంగానే ఉంటాయి. ఉదాహరణకు డయాబెటిస్ వచ్చిన వారికి తొలుత అలసట, నీరసం త్వరగా వస్తాయి, రక్తపోటుకు గురయ్యేవారికి తొలుత తలనొప్పి రావచ్చు అలాగే హృద్రోగులు, కిడ్నీ బాధితులకు కూడా రోగ లక్షణాలు తొలుత సాధారణంగానే ఉంటాయి. రోగలక్షణాలను బట్టి గూగుల్, చాట్‌జీపీటీలపై ఆధారపడి సొంత వైద్యం చేసుకుంటే ఆ తరువాత అది ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వైద్యులను సంప్రదించండి..

'రోగం వస్తే గూగుల్, చాట్‌జీపీటీ వంటి సామాజిక మాధ్యమాలను కాకుండా దవాఖానకొచ్చి వైద్యున్ని సంప్రదించండి. గూగుల్ రోగులందరికీ కామన్‌గా అవసరమైన మందులను మాత్రమే సూచిస్తుంది. వైద్యులు రోగిని పరీక్షించి అవసరమైన మోతాదులో మాత్రలు, చికిత్సనందిస్తారు. ఏఐ అనేది డయాగ్నోసిస్‌లో ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాని అదే వైద్యం చేయదు. అది కేవలం వైద్యుల సూచనల ప్రకారం పనిచేసే సాధనం మాత్రమే. శస్త్ర చికిత్సలు వైద్యుడే చేయాలి. బద్ధకం, దవాఖానకు వెళితే డబ్బులు ఖర్చవుతాయనే కారణంగా చాలామంది ఆన్‌లైన్ వైద్యం చేసుకుంటున్నారు. ఆయాసం కాస్త ఎక్కువై నిమోనియాకు దారితీసేంత వరకూ గూగుల్ ట్రీట్‌మెంట్ మీదనే ఆధారపడుతున్నారు. రోగం మొదట్లోనే వైద్యున్ని సంప్రదించకపోవడం వల్ల చివరికి రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తుంది.

–డాక్టర్ శశిధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, నిమ్స్

ముగ్గురు ఆర్టీఐ కమిషనర్లకే గ్రీన్‌సిగ్నల్

- సమాచార కమిషనర్ల ఎంపికపై గవర్నర్ నిర్ణయం
- ప్రభుత్వ ప్రతిపాదనలపై ఆచితూచి అడుగులు
- నేడు ప్రభుత్వ ఉత్తర్వులు..!

హైదరాబాద్ మే 11 (నమస్తే తెలంగాణ): ఇటీవల సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ) ప్రధాన కమిషనర్‌ను నియమించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ .. కమిషనర్లుగా ఏడుగురిలో ముగ్గురికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. మరో నలుగురిని తిరస్కరించినట్టు సమాచారం. ప్రధాన కమిషనర్, ఏడుగురు కమిషనర్ల ఎంపిక కోసం ప్రభుత్వం 8మంది పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. ఇందులో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని ప్రధాన కమిషనర్‌గా నియమించేందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. కమిషనర్ల ఎంపికను పెండింగ్‌లో పెట్టారు. తాజాగా ప్రభుత్వం ప్రతిపాదించిన వారిలో వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు చెందిన ఓ న్యాయవాది, ఓ టీవీ చానల్ సీనియర్ జర్నలిస్ట్, మైనార్టీ వర్గానికి చెందిన ఓ మహిళను కమిషనర్లుగా నియమించేందుకు ఆయన ఆమోదముద్ర వేసినట్టు ప్రచారం జరుగుతున్నది.

ఆ నలుగురిపై పెద్ద సంఖ్యలో ఆరోపణలు

కోదాడ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన, అధికార పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌తోపాటు సుదీర్ఘకాలంగా గాంధీభవన్‌లో పీఆర్వోగా పనిచేస్తున్న నేత, సీఎం కార్యాలయ చీఫ్ పీఆర్వోగా, నిరుడు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వ్యవహరించి రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తితోపాటు మరో మహిళ పేరును గవర్నర్ తిరస్కరించినట్టు సమాచారం. వీరి ఎంపికపై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జర్నలిస్టుల నుంచి పెద్దసంఖ్యలో ఫిర్యాదులు అందడంతో పక్కన బెట్టినట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం మాత్రం ప్రతిపాదించిన పేర్లన్నింటినీ ఆమోదించేలా గవర్నర్‌పై ఒత్తిడి తెస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. గవర్నర్ మాత్రం ఆచీతూచి అడుగులు వేస్తున్నట్టు రాజ్‌భవన్ వర్గాలు చెప్తున్నాయి.

సంక్షేమ పథకం... సగమే సంతోషం!

- పథకాల లబ్ధిదారులపై అప్పులు, వడ్డీల భారం
- ఇందిరమ్మ ఇంటికి లక్ష రుణం!
- యువవికాసం రీపేమెంట్ భారం 20-40 శాతం
- బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా అందిన రాయితీలు
- ప్రభుత్వ తీరుపై విమర్శలు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలును అటకెక్కించడమే కాకుండా అరకొర పథకాల్లోనూ లబ్ధిదారులపై అప్పుల భారం మోపడమే విధానంగా పెట్టుకున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందంటూ రేవంత్‌రెడ్డి సర్కారు కేంద్ర ప్రభుత్వ పథకాలపైనే ఆధారపడుతున్నదని స్పష్టమవుతున్నది. పథకాల అమలు కోసం లబ్ధిదారులపై భారం మోపుతున్నది. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులపైనా అప్పులభారం మోపేందుకు సిద్ధమైందని తెలుస్తున్నది.

నాడు ఇల్లు ఉచితం.. నేడు నిర్మాణభారం

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వమే డబుల్ బెడ్రూమ్ ఇండ్లను నిర్మించి ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహనిర్మాణం పథకం కింద రూ.5 లక్షల సాయం నాలుగు దశల్లో అందిస్తామని చెప్తున్నది. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాతే నిధులు విడుదల చేస్తామని కండిషన్ పెట్టింది. దీంతో నిర్మాణం మొదలుపెట్టేందుకు అప్పు చేయాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మరో విధానం తీసుకొస్తున్నట్టు తెలుస్తున్నది. పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇంటి నిర్మాణం కోసం రూ. లక్ష రుణం ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ రుణాలపై వడ్డీ భారం కూడా ఉంటుందని తెలుస్తున్నది.

సిబిల్ స్కోర్ సాకులెందుకో!

కేసీఆర్ సర్కారు దళితబంధు కింద రూ. 10 లక్షలు, బీసీబంధు కింద రూ. లక్ష ఒకేసారి గ్రాంట్‌గా ఇచ్చింది. బ్యాంకు జోక్యం, రీపేమెంట్ భారం లేకుండా మొత్తం ప్రభుత్వమే భరించింది. కానీ, కాంగ్రెస్ సర్కారు రాజీవ్ యువవికాసం పథకం పేరుతో రూ.50వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు ఇస్తామని అంటున్నది. 20 నుంచి 40శాతం డబ్బులు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. లబ్ధిదారుల ఎంపికకు కూడా సిబిల్ స్కోర్‌తో లింక్ పెట్టారు. ఇలాంటి కొర్రీలతో పథకం తీసుకొచ్చినా ఉపయోగమేంటని నిరుద్యోగులు వాపోతున్నారు.

తేనీరా తాగుతున్న మిస్‌వరల్డ్ పోటీలకు వచ్చిన అందగత్తెలు

వావ్ నీరా.. వాట్ ఏ టేస్ట్!

- నీరా, కల్లు, తాటి ముంజల రుచి చూసిన అందగత్తెలు
- అందాల పోటీల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా తాటి ఉత్పత్తులు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): నీరామృతాన్ని సేవించిన అందగత్తెలు మైమరచిపోయారు. లొట్టలేసుకుంటూ సహజసిద్ధమైన కల్లు తాగారు. "వావ్.. ఇట్స్ ఐస్ ఫ్రూట్.. ఐస్ ఫ్రూట్.. ఇట్స్ అమేజింగ్.." అంటూ తాటి ముంజలను తనివితీరా తిన్నారు. నీరా టిన్స్‌ను.. కోక్ టిన్స్‌లా ఓపెన్ చేసి తాగుతూ "వావ్.. వాట్ ఏ టేస్ట్" అంటూ అమృతానందాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదించారు. ఆదివారం మిస్‌వరల్డ్ పోటీల్లో వివిధ దేశాల సుందరీమణులకు చిలుకూరు దగ్గర ఎక్స్‌పీరియం ఎకోపార్క్‌లో టొమాటోర (టమాటా ఉత్సవం) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిజం సంస్థ కల్లుగీత కార్పొరేషన్, నీరా కేఫ్ నిర్వాహకుల ఆధ్వర్యంలో నీరా, కల్లు, ముంజలు, హ్యాండ్ క్రాఫ్ట్స్‌ను పరిచయం చేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్నవాళ్లు ఈవెంట్లలో బయటి పదార్థాలు తినరు, తాగరు. కానీ తేనీరా కేఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాటి ఉత్పత్తులు, తాటాకు దండలు, నీరా, కల్లు, ముంజలు చూసి రూల్స్‌బ్రేక్ చేశారు. అందమైన తాటాకు దండలను మెడలో ధరించి, నీరా సేవించారు. అందాలభామలతో పాటు కార్యక్రమానికి వచ్చిన ప్రతినిధులు లొట్టలేసుకుంటూ కల్లు తాగుతూ, ముంజల రుచిని ఆస్వాదించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

జడ్చర్లటౌన్, మే 11 : ఓ వ్యవసాయ పొలంలో స్తంభం పాతేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం జడ్చర్లలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం .. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం దేవునిగుట్టతండా శివారులోని వ్యవసాయ పొలంలో విద్యుత్తు స్తంభం పాతేందుకు కావేరమ్మపేటకు చెందిన ఆంజనేయులు (35), బండమీదిపల్లికి చెందిన మనీశ్‌కుమార్ (24)వెళ్లారు. డ్రిల్లింగ్ మిషన్ ట్రాక్టర్‌తో గుంతతీసే క్రమంలో 11కేవీ విద్యుత్తు తీగలు డ్రిల్లింగ్ మిషన్ ట్రాక్టర్‌కు తగిలి కరెంటు సరఫరా కావడంతో ట్రాక్టర్ డ్రైవర్ మనీశ్‌కుమార్, పక్కనే ఉన్న ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. జడ్చర్ల సీఐ కమలాకర్ అక్కడకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన వ్యక్తులు

ప్రజల్లో ముఖం చెల్లట్లేదు!

- ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్లు కేటాయిస్తానని సీఎం రేవంత్ హామీ
- 16 నెలలైనా నిధులు విడుదల చేయకపోవడంతో ఎమ్మెల్యేల ఆగ్రహం
- ప్రజలు గ్రామాల్లోకి రానివ్వరంటూ ఎమ్మెల్యేల ఆవేదన



హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): "ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మొత్తం 119 నియోజకవర్గాలకు రూ.1,190 కోట్లు కేటాయిస్తున్నాను" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన పగ్గాలు చేపట్టిన కొత్తలో ఆర్భాటంగా ప్రకటించారు. ఈ మాట చెప్పి 16 నెలలైనా నిధులు విడుదల కాకపోవడంతో ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిధులు లేక నియోజకవర్గంలో చిన్న చిన్న అభివృద్ధి పనులకు కూడా చేయలేకపోతున్నామని మండిపడుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ప్రభుత్వంలో ఉన్నా ఏమీ చేయలేక జనాలకు మొహం చూపించుకోలేకపోతున్నామని కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తమను గ్రామాల్లోకి కూడా ప్రజలు రానివ్వరని తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

అటకెక్కిన ఆర్భాటపు హామీ!

2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 2024 జనవరిలో నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్)కుస్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ అని పేరు మార్చింది. 119 నియోజకవర్గాలకు రూ.10 కోట్ల చొప్పున రూ.1,190 కోట్లు కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. నిధుల ప్రతిపాదనలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల ఆమోదం తప్పనిసరి కావడంతో అనవసర జాప్యం అవుతున్నదని ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ప్రతీ నియోజకవర్గంలో సగటున రూ.1.5 కోట్ల విలువైన అభివృద్ధి కూడా జరుగలేదని చెప్తున్నారు. "చిన్న రోడ్డు మరమ్మతు, బోర్‌వెల్ వంటి పనులకు కూడా మంత్రుల వెంట పరుగెత్తాల్సి వస్తున్నది. ఇట్లైతే ప్రజలు మమ్మల్ని గ్రామాల్లోకి రానివ్వరు అని" అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తంచేశారు. ఇక ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నియోజకవర్గాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నది.

అప్పుడు నిధుల వెల్లువ.. ఇప్పుడు వెలవెల

బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గాల అభివృద్ధి నిధులు పార్టీలతో సంబంధం లేకుండా ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలు అందరికీ విడుదలయ్యేవి. ఎంపీ నిధులతో సమానంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏటా రూ. 5 కోట్లకు పెంచారు. ఈ నిధులను శాసనసభ్యులు సిఫారసు చేసిన పనుల కోసం జిల్లా కలెక్టర్లు విడుదల చేసేవారు. కానీ, ప్రస్తుతం ఒక్క రూపాయి కూడా స్వేచ్ఛగా ఖర్చు చేసే అవకాశం లేక, ఎమ్మెల్యేలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ వచ్చే ఎన్నికల్లో జనాల్లోకి వెళ్లి ఓట్లు ఎలా అడుగుతామని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు సన్నిహితుల వద్ద వాపోయారు. ఇలాగే అయితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఓ సీనియర్ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. చిన్నచిన్న పనులు కూడా చేయలేక పోతే నమ్మకం పోతున్నదని చెప్తున్నారు.

సీడీఎఫ్ అంటే ఏమిటి?

పార్లమెంట్ సభ్యుల ఎంపీలాడ్స్ నిధుల తరహాలో శాసనసభ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రత్యేకంగా కేటాయించిన నిధి సీడీఎఫ్. ఈ నిధులతో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు, ప్రజారోగ్య, పాఠశాల భవనాలు, ట్యాంకులు, సీసీ రోడ్లు, సీసీటీవీలు, వృక్షసంపద, స్థానిక ప్రజామౌలిక సదుపాయాలు, స్ట్రీట్ లైట్ల వంటి అభివృద్ధి పనులను శాసనసభ్యులు సిఫారసు చేయవచ్చు. మొత్తం కేటాయింపులో 40 శాతం గ్రీన్ క్యాంపెయిన్‌కు, కొంత ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ పాలనలో ఏడాదిన్నరగా నిధులు లేక పదవులు నామ్‌కే వాస్తే అయిపోయాయని వాపోతున్నారు.

25 చోట్ల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ విధానం

నేటి నుంచి అమలు : పొంగులేటి

హైదరాబాద్, మే 11(నమస్తే తెలంగాణ): ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సోమవారం నుంచి అమలు చేయనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే గతనెల 10వ తేదీ నుంచి 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేస్తున్నట్టు గుర్తు చేశారు. ఆయా చోట్ల విజయవంతం కావడంతో మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయనున్నామని ప్రకటించారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్- రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తెస్తామని తెలిపారు. అవసరమున్నచోట అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని చెప్పారు. హైదరాబాద్ ఆర్వో ఆఫీసు, హైదరాబాద్ ఆర్వో ఆఫీస్ సౌత్, నారపల్లి, ఘట్కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బీబీనగర్, సిద్దిపేట్, సిద్దిపేట్ రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ ఆర్వో ఆఫీసు, జనగాం, ఘన్పూర్, నర్సంపేటతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు

వివరాల సేకరణలో డీఎంలు, యూనిట్ ఆఫీసర్లు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ) : 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 మధ్య రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు 2017 పీఆర్సీ బకాయిలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఇటీవల ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చల్లో బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. చెల్లింపులకు సంబంధించిన వివరాలు సేకరించాలని ఇటీవల ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2017 నుంచి 2024 మధ్యకాలంలో రిటైర్డ్ అయిన వారికి ఎంత చెల్లించాల్సి ఉందో లెక్కకట్టి మొత్తాన్ని చెల్లించేందుకు అన్ని డిపోల్లో రిటైర్డ్ అయిన వారి వివరాలను డిపో మేనేజర్లు, యూనిట్ ఆఫీసర్లు సేకరిస్తున్నారు.

భూదాన్ భూములు మాయం

- తప్పుడు ఎన్వోసీలతో భూములు కాజేస్తున్న 'ఘనులు'
- అధికారులతో కుమ్మక్కై రికార్డులు తారుమారు చేస్తున్న వైనం
- నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- పరిరక్షణకు ఇప్పటికీ ఎలాంటి చర్యలూ చేపట్టని తీరు

రంగారెడ్డి, మే 11 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలో భూదాన్ భూములు క్రమంగా మాయమవుతున్నాయి. గతంలో ఈ జిల్లాలోని అనేక మంది భూస్వాములు వేల ఎకరాలను ఉచితంగా భూదాన్ బోర్డుకు ఇచ్చేయడంతో అనంతరం వాటిని భూమి లేని నిరుపేదలకు పంచి పట్టాలు అందజేశారు. కానీ, ఇటీవల ఈ జిల్లాలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకుల కన్ను భూదాన్ భూములపై పడింది. దీంతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇబ్రహీంపట్నం సమీపంలో ప్రభుత్వం వివిధ కంపెనీలకు దాదాపు 3వేల ఎకరాల భూదాన్ భూములను కేటాయించింది. మిగిలిన భూములను అధికారుల అండతో కొందరు రాజకీయ నాయకులు సొంతం చేసుకున్నారు. వాటిలో రాత్రికిరాత్రే వెంచర్లు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, బాటసింగారం, జాఫర్‌గూడ, కుంట్లూరు, తారామతిపేట, నాగన్‌పల్లి, పోల్కంపల్లి, నెర్రపల్లి, దండుమైలారం, మొండిగౌరెల్లి, యాచారం, నందివనపర్తి తదితర ప్రాంతాల్లో భూదాన్ భూములు అధికంగా ఉన్నాయి. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో సైతం భూదాన్ భూములున్నాయి. రికార్డుల్లో భూదాన్ బోర్డు పేరిట ఉన్న ఆ భూములను అధికారుల అండతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సొంతం చేసుకుంటున్నారు. భూదాన్ భూములను అమ్మటం, కొనటం నేరమైనప్పటికి రికార్డులు తారుమారుచేసి యథేచ్ఛగా క్రయవిక్రయాలు జరుపుతున్నారు.

రంగారెడ్డి జిల్లాలో 22 వేల ఎకరాలు

భూదాన్ ఉద్యమ సమయంలో ఆచార్య వినోభాబావే, భూదాన్ పోచంపల్లికి చెందిన రాంచంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లాలో పర్యటించి దాదాపు 22 వేల ఎకరాలకుపైగా మిగులు భూములను సేకరించారు. హైదరాబాద్ శివారులోని బాలాపూర్, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, జాఫర్‌గూడ, పిగ్లీపూర్, కుంట్లూరు, తారామతిపేట, వట్టినాగులపల్లి, మంఖాల, మహేశ్వరంలో ఆ భూములు విస్తరించి ఉన్నాయి. వాటిలో కొన్నింటిని అప్పట్లో భూముల్లేని పేదలకు పంపిణీ చేశారు. మరి కొన్ని భూములను లీజుకు ఇచ్చారు. మిగిలిన భూములు భూదాన్ బోర్డు ఆధీనంలో ఉన్నాయి. కానీ, అదంతా పేరుకు మాత్రమే. రికార్డులను తారుమారు చేసి చాలా భూములను రియల్టర్లు అన్యాక్రాంతం చేశారు.

అన్యాక్రాంతంపై విచారణ జరపాలి

"రంగారెడ్డి జిల్లాలో భూదాన్ భూములను కాజేసేందుకు ఎంతో మంది ఏండ్ల తరబడి ప్రయత్నిస్తున్నారు. కొందరు బడాబాబులు అధికారులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా ఆ భూములను కబ్జా చేస్తున్నారు. దీనిపై స్పందించాల్సిన ప్రభుత్వం ఏమీ పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం భూదాన్ భూములపై దృష్టిసారించాలి. అన్యాక్రాంతంపై విచారణ జరిపించి ఆ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. లేకుంటే భూదాన్ భూములు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నది.

– బోడ సామేల్, సీపీఎం జిల్లా నాయకుడు

నకిలీ ఎన్వోసీలతో ఎసరు..

భూదాన్ భూములను కాజేసేందుకు కొందరు నానా రకాల కుట్రలు చేస్తున్నారు. ఆ భూములు భూదాన్ బోర్డు పరిధిలో లేవని నకిలీ ఎన్వోసీలను సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూములుగా మారుస్తున్నారు. అలా ఇప్పటికే చాలా భూములు చేతులు మారుతున్నాయి. మరికొందరు సామాజిక సేవా కార్యక్రమాల పేరుతో భూదాన్ భూములను లీజుకు తీసుకుని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం మేల్కొవాలని, భూదాన్ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపించి, కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.